క్లుప్తంగా

వరద ముంపులోనూ ఫ్యామిలీ డాక్టర్



అప్పనరామునిలంకలో వైద్యసేవలకు వరదనీటిలో వెళుతున్న వైద్యాధికారులు

సఖినేటిపల్లి: వరద ముంపు గ్రామం అప్పనరాముని లంకలో మంగళవారం వైద్యాధికారులు ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. సచివాలయం -1లో నిర్వహించాల్సిన ఈ క్యాంపును సఖినేటిపల్లి, రామేశ్వరం వైద్యాధికారులు డాక్టర్లు పావని, జయగాయత్రి, యూనస్‌లు వరద నీటిలో, కాలినడకన వెళ్లి ఇంటింటా వైద్య సేవలందించారు. అవసరమైన వివిధ పరీక్షలు నిర్వహించిన సిబ్బంది, తగిన మందులను అందజేశారు. వైద్య సిబ్బంది కాంతా, ప్రవీణ, మమత, కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బారావు సేవలు ఆదర్శం

ఆలమూరు: గ్రామంలోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో రూరల్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన టేకి వెంకట సుబ్బారావు సేవలు ఆదర్శనీయమని ట్రాన్స్‌కో రామచంద్రపురం డీఈ వై.విజయానంద అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం రాత్రి లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకట సుబ్బారావు ఉద్యోగ విరమణ సభ జరిగింది. విధి నిర్వహణలో ఆయన ప్రజలకు అందించిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకట సుబ్బారావును స్థానికులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు ఘనంగా సత్కరించి మెమెంటోను బహూకరించారు.

బడి ఈడు పిల్లలంతా పాఠశాలలో ఉండాలి

ఆత్రేయపురం: 5–18 సంవత్సరాల వయసు పిల్లలంతా ప్రభుత్వ లేదా, గుర్తింపు పొందిన పాఠశాల, కాలేజీల్లో చేర్పించాలని, అందుకు అవసరమైన డ్రైవ్ నిర్వహించాలని ఉపాధ్యాయులను ఎంపీడీఓ నాతిబుజ్జి కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అకడమిక్ క్యాలెండర్ అనుసరించి ఈ విద్యా సంవత్సరం అన్ని కార్యక్రమాలు సమయానికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు వరప్రసాద్, పచ్చా సాహెబ్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గడ్డి లాగుతుండగా కాటేసిన పాము

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలేనికి చెందిన మేడిశెట్టి నాగబ్రహ్మాజీరావు పశువులకు గడ్డి మేటు నుంచి గడ్డి లాగుతుండగా అతడి కాలుపై గడ్డిమేటులో ఉన్న తాచుపాము కాటేసింది. వరదలకు వచ్చి గడ్డిమేటులో దాగిన పాము నాగబ్రహ్మాజీరావుని కాటేసింది. ఇతడిని స్థానిక రైతులు వీరవల్లిపాలెం పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుడు ఎస్.సునీల్ ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన చికిత్స కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి ఉన్నత వైద్యం కోసం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

వాటర్ ట్యాంకుల నిర్మాణాలకు శంకుస్థాపన

సఖినేటిపల్లి: మండలంలోని బళ్లవారి పేట, లాకుపేట, రామేశ్వరం గరువు ప్రాంతాల్లో మంగళవారం 60 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న మూడు వాటర్ ట్యాంకుల నిర్మాణాలకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శంకుస్థాపన చేశారు. శివారు ప్రాంతాల్లో తాగునీరు సరఫరా మెరుగుపర్చేందుకు ఈ ట్యాంకులు దోహదపడతాయన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైఎస్ ఎంపీపీ రాపాక దీవెన కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు జగనన్న గోరుముద్ద

కొత్తపేట: ప్రభుత్వ లక్ష్యం మేరకు పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పేరిట మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు ఉపాధ్యాయులు, పథకం నిర్వాహకులకు సూచించారు. మండలంలోని బిళ్లకుర్రు శివారు కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను మంగళవారం ఎంపీడీఓ, ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్‌తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు అంశాలపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి తన ఇంట్లో తల్లి వండిన భోజనం తింటున్నాననే భావన కలిగేలా రుచికరంగా వండి వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల విద్యార్థులతో కలసి ఎంపీడీఓ, ఎంఈఓ భోజనం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మంగిపూడి శ్రీరామచంద్రమూర్తి, హెచ్‌ఎం శర్మ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వై.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక స్వావలంబన

అంబాజీపేట: కుట్టుమెషీన్లపై మహిళలకు ఇస్తున్న శిక్షణ ద్వారా ఆర్థిక స్వావలంబనకు ఎంతో దోహదపడుతుందని రాజమహేంద్రవరం స్వర్ణా సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ పి.స్వర్ణలత, సీఆర్పీ ఫోర్స్ ఇండియా ఫౌండర్ జి.పాల్‌ప్రసాద్ అన్నారు. గంగలకుర్రు పెదగరువులో సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అధ్యక్షతన స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్, సీఆర్పీ ఫోర్స్ ఇండియా ఆధ్వర్యంలో 100 మంది మహిళలకు, యువతికి కుట్టుమెషీన్లను మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని 8 గ్రామాల్లో టైలరింగ్, కుట్టుమెషీన్‌లపై శిక్షణ పొందిన 200 మందికి గాను 100 మందికి ధ్రువీకరణ పత్రాలు, కుట్టు మెషీన్లను పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి త్వరలో అందజేస్తామన్నారు.



జి.పెదపూడిలంకలో వరదలకు కుళ్లిపోయిన పచ్చి మిరపతోట



టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి పడవపైకి చేరుస్తున్న వాటర్ టిన్‌లు



పెదపట్నం నుంచి గడ్డిమోపుతో వరద నీటిలో నడిచి వస్తున్న రైతు



రావులపాలెం లంకలో వరద తగ్గుముఖం పట్టడంతో తేరుకుంటున్న అరటి తోటలు

తేరుకుంటున్న ముంపు గ్రామాలు

- కాజ్‌వేలను వీడని వరద
- పేరుకున్న బురద



బూరుగులంక రేవులో బురదలో పడవ ఎక్కుతున్న ప్రజలు



బూరుగులంకలో బురదలో గేదెలను తోలుకువెళ్తున్న రైతు

మామిడికుదురు: గోదావరి వరద శాంతించినప్పటికీ ఇంకా కాజ్‌వేను వరద వీడలేదు. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు ముంపు నీటిలో బోట్లపై రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పాటు ట్రాక్టరుపై ఎక్కి ఏటిగట్టు ప్రాంతానికి చేరుకుంటున్నారు. పాశర్లపూడి ఏటిగట్టు దిగువన అప్పనపల్లి కాజ్‌వేపై ఇంకా రెండడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ లంక గ్రామాల ప్రజలు బోట్లు, ట్రాక్టర్లను ఆశ్రయించి రాకపోకలు సాగిస్తున్నారు. మామిడికుదురు శివారు కొర్లగుంట ప్రాంతంలో పంచాయతీరాజ్ రోడ్డుపై వరద నీటి ప్రవాహం తగ్గింది. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. మూడు రోజుల పాటు తీర గ్రామాల ప్రజల్ని తీవ్ర కలవరపాటుకు గురి చేసిన గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మండలంలోని నందంపూడిలో, బొంతువారిపేట, తొండవరం రజకపేట, వాకగలరువు రావిచెట్టు సెంటర్ వద్ద నివాస ప్రాంతాల్లో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. వరద ముంపు తగ్గినప్పటికీ ఇంటికి వెళ్లలేని పరిస్థితి బాధితుల్లో నెలకొంది. ముంపు ప్రాంతాల్లో వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్‌లు ముంపు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

వరద ముంపులోనే లంక గ్రామాలు

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో ముంపు కొనసాగుతోంది. అప్పనరామునిలంక గ్రామానికి వరద ముంపు నీటిలోనే పడవలపై గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. బాధితులకు ఆహారం, తాగునీరు సరఫరా చేస్తున్నారు. సఖినేటిపల్లిలంక పరిధిలోని సఖినేటిపల్లి రేవు వద్ద, బస్టాండ్ తదితర ఏరియాల్లోను, సఖినేటిపల్లి లాకుపేటలోని గోదావరి పాయను ఆనుకుని ఉన్న ఇళ్లవద్ద వరద ఉధృతి యథాతథంగా కొనసాగుతోంది. ఆయా ముంపు ఏరియాల్లో బాధితులకు తాగునీరు, భోజన వసతి ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నారు.

తగ్గుముఖం పట్టిన వరద

పి.గన్నవరం: వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాలు జలదిగ్బంధం నుంచి బయట పడుతున్నాయి. మండలంలో మొత్తం 9 లంక గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. కె.ఏనుగుపల్లి రహదారిపై వరద ఉధృతి తగ్గడంతో రాకపోకలు మొదలయ్యాయి. జి.పెదపూడి ఏటిగట్టు దిగువన సీసీ రోడ్డు వరద నీటి నుంచి బయటపడడంతో నాలుగు లంక గ్రామాల ప్రజలు బూరుగులంక రేవుకు నేరుగా వెళ్లి పడవలు దాటు తున్నారు. మానేపల్లి శివాయలంక గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. లంక గ్రామాల్లో వరద బాధితులకు అధికారులు సహాయక కార్యక్రమాలు చేపట్టారు. మండలంలో 2077 కుటుంబాలు వరద ముంపు బారిన పడటంతో వారందరికీ బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. మెడికల్ క్యాంపుల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. పాడి రైతులకు పశుగ్రాసం అందజేస్తున్నారు. జి.పెదపూడి లంకలో వైద్యాధికారి నాగార్జున, హెల్త్ సూపర్‌వైజర్ రంగనాథ్, హెల్త్ అసిస్టెంట్‌లు సాల్మన్‌రాజు, రవీంద్ర, ఏఎన్‌ఎంలు, ఆశా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. లంక భూముల్లో వరద ముంపునకు గురైన అరటి, పచ్చిమిర్చి, మునగ, బెండ తదితర పంటలు కుళ్లిపోవడంతో తీవ్రంగా నష్ట పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల ప్రత్యేక అధికారి తిక్కా వెంకటేశ్వర్లు వరద ప్రాంతాల్లో పర్యటించి, సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

శాంతించిన గోదావరి

రావులపాలెం: మండలంలోని ఊబలంక, రావులపాలెం, కొమరాజులంక, గోపాలపురం, పొడగట్లపల్లి లంక ప్రాంతాల్లో వరద తగ్గడంతో పశుగ్రాసం అలాగే దొండ, మిరప, వంగ తదితదిత కూరగాయలు తోటలు, అరటి, కంద లాంటి వాణిజ్య పంటలు ముంపు నుంచి బయటపడుతున్నాయి. అయితే మిరప, ఆకుకూరలు, పశుగ్రాసం పూర్తిగా పాడైపోయాయి. ఊబలంక శివారు తోకలంకకు వెళ్లే మార్గంలో వదర తగ్గుముఖం పట్టింది. రాకపోకలు నావలపైనే కొనసాగుతున్నాయి.

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం–అయినవిల్లిలంక వెదురుబిడెం కాజ్‌వే వరద తగ్గుముఖం పట్టడంతో లంక ప్రజలు రాకపోకలు ప్రారంభమయ్యాయి. అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నారు. బ్లీచింగ్, స్ప్రే చేయిస్తున్నారు. మురుగునీరు లేకుండా పారిశుధ్య చర్యలు చేపట్టారు.

పడవపై పింఛన్ పంపిణీ



అప్పనరామునిలంక వరదలో పడవపై పింఛన్ పంపిణీలో పాల్గొన్న ఎంపీపీ, వలంటీర్

సఖినేటిపల్లి: అప్పనరామునిలంకలో మంగళవారం వరద నీటిలో వెళుతున్న పడవపైనే వెళ్లి వలంటీరు జాన్‌బాబు, పింఛన్ దారుడు బర్రే నాగేశ్వరరావుకు పింఛన్ అందజేశారు. పింఛన్లు పంపిణీకై వరద సమయంలో బాధ్యతలు నిర్వహిస్తున్న జాన్‌బాబుకు మరో పడవపై పింఛన్‌దారుడు నాగేశ్వరరావు తారసపడ్డాడు. దీంతో నీటిలో పడవ నిలుపుదల చేయించి పింఛన్ అందజేశారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

వరదనీరు తగ్గాకే పంటల సస్యరక్షణ

కొత్తపేట: గోదావరి వరద ప్రభావిత లంక భూముల్లో వరద నీరు తగ్గిన వెంటనే తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని స్థానిక ఉద్యాన అధికారి (హెచ్‌ఓ) గంటా కోటేశ్వరరావు రైతులకు సూచించారు. స్థానిక ఉద్యాన శాఖ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులతో మంగళవారం హెచ్‌ఓ కోటేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. వరద నీరు తగ్గిన వెంటనే ఆయా పంటల రైతులు స్థానిక ఉద్యాన అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆయా పంటలను సంరక్షించుకోవాలన్నారు.

విద్యా బ్యాంకు సేవలు ప్రారంభం

రావులపాలెం: రావులపాడులో పేద చిన్నారుల విద్యాభివృద్ధికి, విద్యాసామగ్రి పంపిణీ చేయడానికి విద్యా బ్యాంకు ప్రారంభించినట్టు శ్యామ్ మంగళవారం తెలిపారు. ఈ బ్యాంకు ద్వారా సంపన్నుల వద్ద నుంచి పుస్తకాలు స్టేషనరీ రూపంలో డిపాజిట్ చేయించుకుని వాటిని పేద చిన్నారులకు పంపిణీ చేస్తామని శ్యామ్ చెప్పారు. రావులపాడు గుడారాల్లో నివసిస్తున్న 50 మంది వలస కూలీల చిన్నారులకు, భిక్షాటన చేసుకునే చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీలను శ్యామ్ ఫ్యామిలీ పంపిణీ చేసింది.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఆలమూరు, విశ్వేశ్వరాయపురంలలో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, వరప్రసాదరావు



ఆలమూరులో మహిళకు బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



విశ్వేశ్వరాయపురంలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

ఆలమూరు: ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేస్తూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దక్షత ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరులోని శెట్టిబలిజపేట, యాదవులపేటలో మంగళవారం పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎనిమిదో విడత గడప గడపకూ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలు అడిగిన సమస్యలను పరిష్కరిస్తూ, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను వివరిస్తూ అంకిత భావంతో ముందుకు సాగారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఎంపీఏఎస్ అధ్యక్షులు యనమదల నాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ వసుం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న నలుగురిని రాష్ట్ర వైఎస్సార్ సీపీ శాఖ జగనన్న సపోర్టర్స్‌గా ఎంపిక చేసింది. దీంతో నాలుగు మండలాల నుంచి ఎంపికైన రావూరి దుర్గాప్రసాద్, పి.రవితేజ, బడుగు రమేష్, జి.మనోహర్‌ను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఈసందర్భంగా నియామక పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. సీఎం జగన్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు.

సీఎం జగన్ పాలనలో సంతోషంగా ప్రజలు: ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనతో గ్రామ గ్రామాన ప్రజలు సంతోషంగా ఉన్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో మంగళవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదలకు నాణ్యమైన విద్యను ప్రభుత్వమే అందించాలన్న చక్కని నిర్ణయం ముఖ్యమంత్రి జగన్ తీసుకున్నారని అన్నారు. ×నాడు–నేడు× ద్వారా పాఠశాలలను అధునాతనంగా తీర్చిదిద్ది కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా అభివృద్ధి చేశారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, గెద్దాడ వెంకట సత్యనారాయణ, కొల్లాబత్తుల అశోక్‌కుమార్, గుబ్బల రమేష్, వీర వెంకట సత్యనారాయణ, గుండుమేను నారాయణమూర్తి, చింతా రాజబాబు, యెనుముల నారాయణ స్వామి, చెల్లింగి చినబాబు, గోగన్నమఠం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో వంద మంది మహిళల చేరిక



ఆలమూరులో పార్టీలో చేరిన మహిళలకు కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆలమూరులో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో సుమారు వంద మంది మహిళలు వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో బోయిడి కుమారి, గూటం మేరీ, సీహెచ్ సునీత, ఎ.గ్రేస్‌లీ ఆధ్వర్యంలో చేరిన మహిళందరికీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర సంక్షేమాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు మహిళలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మహిళలు మరింత ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు రాబోయే ఎన్నికల్లో మరోసారి సీఎం జగన్‌కు మద్దతు పలకాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఎంపీటీసీ ఉన్నమట్ల విజయకుమారి, గాడ అన్నపూర్ణ, శ్రీపతి వీరవేణి తదితరులు పాల్గొన్నారు.

అంధ దంపతుల ఔదార్యం



పాశర్లపూడిలో వరద బాధితులకు కూరగాయలు అందజేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

మామిడికుదురు: పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాలకు చెందిన వరద బాధితులపై కాకినాడకు చెందిన అంధ దంపతులు ఔదార్యం చూపారు. పై రెండు గ్రామాలకు చెందిన 200 మంది బాధితులకు కాకినాడకు చెందిన దాట్ల సత్యనారాయణరాజు, విజయకుమారి దంపతులు మంగళవారం కూరగాయలు పంపిణీ చేశారు. వీటిని ఇన్‌చార్జ్ తహసీల్దార్ జె.వెంకటేశ్వరి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అంధులైన సత్యనారాయణరాజు, విజయకుమారి దంపతులు ఎంతో ఉదారంగా వరద బాధితులకు సహాయం అందించడం ముదావహమన్నారు. దాతలు వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఈ అంధ దంపతులు సేవలు నిర్వహిస్తారని చెప్పారు. సత్యనారాయణరాజు దంపతులకు ఆమె అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొనుకు ప్రేమజ్యోతి, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, పాశర్లపూడి సత్రం చైర్మన్ వాసంశెట్టి రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, కుమారి, బూరమ్మ, బీర చిన్న, రాజు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఉదారంగా సాయం



అప్పనపల్లిలో వరద బాధితులకు బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



టేకిశెట్టిపాలెంలో ప్రభుత్వ సాయం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక, ఆర్డీవో వసంత రాయుడు



మూలస్థాన అగ్రహారంలో పాడిరైతులకు పశువుల దాణాను అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

మామిడికుదురు: గోదావరి వరద బాధితులకు ప్రభుత్వం ద్వారా ఉదారంగా సహాయం అందించి వారిని ఆదుకుంటామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. ఆయన మంగళవారం పెదపట్నం, అప్పనపల్లి గ్రామాల్లో పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బియ్యాన్ని పంపిణీ చేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ వరదల వల్ల నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం బియ్యంతో పాటు నిత్యావసరాలు అందజేస్తుందన్నారు. వీటితో పాటు ఆర్థికసాయం అందించేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు చెందిన బాధితులందరికీ బియ్యంతో పాటు నిత్యావసరాలు అందజేస్తారని చెప్పారు. పశుగ్రాసం లేక ఇబ్బంది పడుతున్న రైతులకు పశువుల దాణా కూడా అందించి వారిని ఆదుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వంపై అనవసరంగా బురద చల్లకుండా సహకరించాలని ఎమ్మెల్యే చిట్టిబాబు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, నగరం ఎస్సై షేక్ జానీబాషా, అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: వరద ముంపు బాధితులకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం టేకిశెట్టిపాలెంలో వరద ముంపు బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా బియ్యం, నిత్యావసరాలను ఆర్డీవో వసంతరాయుడుతో కలసి ఎమ్మెల్యే రాపాక పంపిణీ చేశారు. ఏటిగట్టుకు దిగువన పూర్తి వరద ముంపులో ఉన్న అప్పనరామునిలంకలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయాన్ని ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు మంగళవారం పంపిణీ చేశారు.

రాజోలు: వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం రాజోలు నున్నవారిబాడవ, మేకలపా లెం వరద బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆర్డీఓ వసంతరాయుడు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, సర్పంచ్ రేవు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: గోదావరి వరదల్లో నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే, చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఎల్.అనిత అధ్వర్యంలో మండలంలోని మూలస్థాన అగ్రహారంలో వరద బాధిత పాడి రైతుల పశువుల దాణా (టీఎంఆర్) పంపిణీకి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక పశు వైద్యశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన పంపిణీలో ఐదు మెట్రిక్ టన్నుల దాణాను రైతులకు అందజేశారు. అనంతరం మూలస్థాన అగ్రహారంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఏసర్ కంపెనీ సహకారంతో ప్రభుత్వం అందజేసిన టెలివిజన్ ద్వారా ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను ఎమ్మెల్యే ప్రారంభించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి నాణ్యతల్లో రాజీ పడవద్దని నిర్వాహకులకు సూచించారు.

అయినవిల్లి: మండలం వరద సహాయక చర్యల్లో భాగంగా పొట్టిలంక, కొండుకుదురు లంకల్లో వరద ముంపుకు గురైన బాధితులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన బియ్యం, నిత్యావసరాలను మంగళవారం పంపిణీ చేశారు. వీటిని జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ నాగవిజయలక్ష్మి పంచారు.

వరద బాధితులకు నిత్యావసరాలు

మామిడికుదురు: గోదావరి వరద ప్రభావిత గ్రామాల్లో నిత్యావసరాలను పంపిణీని మంగళవారం ప్రారంభించారు. మండలంలోని ఆరు గ్రామాల్లో 5,536 కుటుంబాలు వరద తాకిడికి గురయ్యాయని అధికారులు అంచనా వేశారు. అప్పనపల్లిలో 1834 కుటుంబాలు, బి.దొడ్డవరంలో 776 కుటుంబాలు, పాశర్లపూడిలో 235 కుటుంబాలు, పాశర్లపూడిలంకలో 22 కుటుంబాలు, పెదపట్నం గ్రామంలో 821 కుటుంబాలు, పెదపట్నంలంకలో 1848 కుటుంబాలు వరద తాకిడికి గురయ్యాయని అధికారులు నిర్ధారించారు. పెదపట్నంలంక, బి.దొడ్డవరం మినహా మిగిలిన గ్రామాల్లో నిత్యావసరాల పంపిణీని ప్రారంభించారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోలు బియ్యం, కిలో కంది పప్పు, కిలో నూనె, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు అందిస్తున్నారు. పెదపట్నం, అప్పనపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు నిత్యావసరాల పంపిణీని ప్రారంభించారు.

పశుపోషణకు ప్రభుత్వ ప్రోత్సాహం

కొత్తపేట: పశుపోషణకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి అన్నారు. మండలంలోని వానపల్లి శివారు లంక ప్రాంతాల పశువులకు పశుగ్రాసంగా ఎండుగడ్డిని తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, నాయకులు మంగళవారం సాయంత్రం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, కామిశెట్టి అమ్మన్న, మండల సేవాదళ్ అధ్యక్షుడు జీపీ, పార్టీ గ్రామ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: వరద ముంపు ప్రాంతాల్లోని పశువులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం పాడి రైతులకు పశువుల దాణాను అందజేస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నాగుల్లంకలో వరద ముంపు ప్రాంతాలకు చెందిన పాడి రైతులకు మంగళవారం ఆయన 5.5 టన్నుల పశువుల దాణా బస్తాలు పంపిణీ చేశారు. అనంతరం శివాయలంక వద్ద వరద ఉధృతిని చిట్టిబాబు పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. 'నాడు–నేడు'లో జరుగుతున్న జెడ్పీహెచ్‌ఎస్ అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మడికిలో అగ్నిప్రమాదం

ఆలమూరు: మండలంలోని మడికిలో జరిగిన అగ్ని ప్రమాదంలో యార్లగడ్డ యోహాన్ కుటుంబ సభ్యులు సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. స్థానిక ఎస్సీకాలనీలోని రేకులషెడ్‌లో భార్య నాగమణి వంట చేస్తుండగా సిలిండర్ వద్ద గ్యాస్ లీకై అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో భయాందోళన చెందిన సుమారు 15 మంది ఉమ్మడి కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. ప్రమాద విషయం తెలుసుకున్న సర్పంచ్ లక్ష్మీమౌనిక మండపేట అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం అందించారు. ఆ వాహనం వచ్చేలోపే ఇంట్లో ఉన్న గృహోపకరణాలు, వంట పాత్రలు, దుస్తులు కాలి బూడిదయ్యాయి.